

# పుస్తక పరిచయం




ప్రచురణ:
అట్లూరి ఝాన్సీలక్ష్మి
దివ్యసాయి ఎన్‌క్లేవ్, అశోక్ నగర్
ఎస్.బి.ఐ.కాలనీ -1 , విజయవాడ-5000 010
ఫోన్: 92461 82977

**తెలుగు పుస్తక ప్రచురణరంగం** స్వర్ణయుగాన్ని చవిచూసిన దశాబ్దాల్లో అత్యుత్తమ ఆధునిక తెలుగు సాహిత్యాన్ని అందించిన ప్రచురణ సంస్థల్లో అగ్రగామిగా చెప్పుకోదగ్గ సంస్థ - నవోదయ పబ్లిషర్స్. విజయవాడ కేంద్రంగా 1957లో ప్రారంభమై 60 సంవత్సరాలపాటు బంగారురోజుల్నీ, గడ్డుకాలాన్నీ కూడా చవిచూసి 2017లో మూతపడిపోయింది. 'మూతపడిపోయింది' అనే మాటవాడడం బాధాకరమే కానీ రోజురోజుకీ తగ్గిపోతున్న అచ్చుపుస్తకాల పాఠకులూ, మారిపోతున్న వారి అభిరుచీ ఈ పరిణామానికి కారణం అనుకోవడానికి ఏ మాత్రం సందేహించాల్సిన అవసరం లేదు. అరవై సంవత్సరాల పాటు ఆధునిక పుస్తక ప్రచురణలో ఎన్నో మైలురాళ్ళకు సాక్షీభూతమైన నవోదయా పబ్లిషర్స్‌కి మూలస్తంభం అట్లూరి రామమోహనరావుగారు. ఆయన పుస్తకప్రచురణను ఒక వ్యాపారంగా కాక జీవితంలో ఒక విడరాని భాగంగా చేసుకున్నారనడానికి సాక్ష్యం - సంస్థపేరునే ఇంటిపేరు చేసుకోవడం. క్రిందటి సంవత్సరం కన్నుమూసిన రామమోహనరావుగారికి ఘననివాళి ఈ '"నవోదయ రామమోహనరావు ప్రస్థానం". ఎన్నో తెలుగు పుస్తకాలని అత్యద్భుతంగా ముద్రించి తెలుగుపాఠకులకు వెలలేని కానుకగా అందించిన రామమోహనరావుగారు ఈ పుస్తకాన్ని చూసుకుని ఉంటే ఎంతో ఆనందించి ఉండేవారనడంలో సందేహం లేదు. అందమైన పుస్తక ముద్రణ రచన విలువను ద్విగుణీకృతం చేస్తుందని నమ్మి, ఆచరించి చూపించిన రామమోహనరావుగారి ప్రమాణాల స్థాయిలో ఉంది ఈ పుస్తకం. 250 పేజీల పుస్తకంలో రామమోహనరావుగారు వివిధ సందర్భాల్లో ఇచ్చిన ఇంటర్వ్యూలు వారి నేపథ్యం, నవోదయ నేపథ్యం గురించిన సమగ్ర సమాచారాన్ని మనకళ్ళముందు ఉంచుతాయి. ఊహతెల్సిన వద్దనుంచీ కమ్యూనిస్టుభావాలను అవగాహన చేసుకుని జీవితాంతం అవేభావాలను నిలుపుకున్న ఆదర్శజీవి రామమోహనరావుగారు. బాపు-రమణగార్ల పుస్తకాలను తెలుగువారి ముంగిళ్ళలోకి తీసుకొచ్చింది నవోదయ రామమోహనరావుగారే. తనకు బాపు-రమణగార్లతో ఉన్న అనుబంధం గురించి నాలుగైదు వ్యాసాల్లో వివరించారు. తెలుగు పుస్తక ప్రచురణ గురించి రామమోహనరావుగారు వ్రాసిన వ్యాసం ఒక పరిశోధనా వ్యాసం, సిద్ధాంత వ్యాసం. ఈరామమోహనరావుగారు వివిధ సందర్భాల్లో వ్రాసిన ఇలాంటి వ్యాసాలన్నీ ఒక ఎత్తు ఐతే - ఆయనను గుర్తుచేసుకుంటూ, వారికి నివాళిగా ఎంతోమంది ప్రముఖులూ, వారి కుటుంబ సభ్యులూ వ్రాసిన వ్యాసాలు మరొక ఎత్తు. ఈ వ్యాసాలన్నీ రామమోహనరావుగారి నిస్వార్థ వ్యక్తిత్వానికి నిలువెత్తు దర్పణాలు. అక్షరాన్ని, పుస్తకాన్ని ఆయన ఎంత ప్రేమించేవారో, రచయితలకు ఎంత విలువనిచ్చేవాళ్ళో, పుస్తక ప్రచురణకు జీవితాన్ని ఎలా అంకితం చేశారో ఈ వ్యాసాలన్నింటిలో ఎన్నో విశేషాలున్నాయి. ఒక్కో వ్యాసమూ రామమోహనరావుగారికి ఆత్మీయ నివాళి. పుస్తకం మొదటినుంచి చివరివరకూ చదువుతుంటే - రామమోహనగారిని దగ్గరగా చూస్తున్నట్లు, వారితో మాట్లాడుతున్నట్లు, వారితో కలిసి విజయవాడలో వారి పుస్తకాల షాపులో కూర్చునట్లు అనిపిస్తుంది. రచయితల్లో అరుదైన రచయితలెలా ఉంటారో పబ్లిషర్స్‌లో అరుదైన పబ్లిషర్సూ ఉంటారు. అలాంటివారిలో ప్రథమ పంక్తిలో పరిగణించదగిన ప్రముఖులు నవోదయ రామమోహనరావుగారు. ఓ అందమైన అమ్మాయి, మొహమంతా కళ్ళుచేసుకుని పుస్తకాన్ని చదవడంలో ఉన్న ఆనందాన్ని మనస్ఫూర్తిగా వెలువరిస్తున్న అమ్మాయి.. ఆ ముఖం గుర్తున్నంత కాలం నవోదయ లోగో గుర్తుంటుంది. నవోదయ పేరు తెలుగు సాహిత్యంలో విడదీయరాని భాగంగా అల్లుకుపోయింది. ఇప్పుడు ఆ సంస్థ లేకపోవచ్చు, కానీ నవోదయ ప్రచురించిన పుస్తకాలు కాలనాళికలో భద్రంగా ఉంటాయి..! ***




రావూరి గౌతమ్
మంజీరా పైప్ లైన్ రోడ్
మదీనాగూడ, హైదరాబాదు - 500 049
ఫోన్: 9989916677

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor,
KOUMUDI (Web Monthly)
4251 - Escudo Ct
Dublin - CA 94568, USA

**సినిమాలకు,** సినీతారలకు, సినీరంగానికి - భారతీయుల్లో ముఖ్యంగా తెలుగువారిలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. తెలుగువారి సంస్కృతిలో సినిమా అనేది అవినాభావంగా అల్లుకుపోయింది. ఇతరదేశాల్లో సినిమా అంటే, సినిమానే, సినీతారలంటే సినిమాల్లో నటించే నటులే, కానీ భారతదేశంలోనూ, తెలుగువారిలోనూ అధికసంఖ్యాకుల్లో సినీతారలంటే ప్రత్యేకమైన ఆకర్షణ, నిలువెత్తు అభిమానం పొంగిపొర్లుతాయి. సినీతార ఏం చేసినా వార్తే, ఏం మాట్లాడినా శక్తివంతమే. సినిమావార్తలు చాలామందికి నిత్యపఠనీయాలు. మామూలు సినీతారలకే ఇంత ఆకర్షణ ఉంటే - తెలుగుసినిమా రంగంలో ఒక శకాన్ని సృష్టించిన చిరంజీవి సంగతి వేరే చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను. 40 సంవత్సరాలు పైగా తెలుగు సినీప్రేక్షక హృదయాల్లో కొలువై ఉన్న మెగాస్టార్ ఒక వ్యక్తికాదు, బలీయమైన శక్తి. ఆయన నటించిన సినిమాలు అభిమానులకు సదాస్మరణీయాలు. అలాంటి మెగా హీరో నటించిన 40 సినిమాల గురించిన అరుదైన సమాచారం, విశ్లేషణ ఈ పుస్తకంలో ప్రధానాంశాలు. ఈ పుస్తకం వ్రాసింది ఏ సినీజర్నలిస్టో ఐతే అది వారి వృత్తిలో ఒక భాగం కాబట్టి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం ఉండేది కాదేమో. ఐతే ఈ పుస్తకం వ్రాసింది ఒక ఐ.టి ఇంజినీర్, పైగా యువకుడు. అది ఈ రచయిత ప్రత్యేకత, ఈ పుస్తకం ప్రత్యేకత కూడా. యువరచయిత రావూరి గౌతమ్‌గారు ఏ చేయితిరిగిన రచయితకూ , ఏ సీనియర్ సినీజర్నలిస్ట్‌కూ తీసిపోని విధంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. ఐ.టి నేపథ్యం ఉండడం వల్లనేమో, ఈ పుస్తకంలోని ప్రతి అధ్యాయాన్నీ ఒక నిర్దిష్టమైన క్రమంలో అమర్చారు. చిరంజీవి నటించి విజయవంతం చేసిన 40 సినిమాలను ఎంపికచేసుకున్నారు. ప్రతి సినిమాకు సంబంధించి కుప్తంగా నిర్మాణ నేపథ్యం, ప్రారంభ విశేషాలు, సినిమా కథ, పాత్రల విశ్లేషణ, ముఖ్యంగా చిరంజీవి ప్రదర్శించిన ప్రత్యేకతలు, షూటింగ్ విశేషాలు, విజయవార్తలు, చిత్రప్రత్యేకతలు ఇలా నిర్దిష్టమైన విభాగాలుగా ఒక్కో అధ్యాయాన్ని విభజించారు. ఏ సినిమా గురించైనా ఎక్కడా బిగి సడలకుండా రచన వేగాన్ని కొనసాగించారు. రచయిత ప్రతి వాక్యంలో అది వ్రాసేప్పుడు తను ఎంత అనుభవిస్తూ వ్రాశారో ప్రస్ఫుటంగా తెలుస్తుంది. సందర్భానుసారం ఆయా చిత్రానికి చెందిన సాంకేతిక నిపుణులు ముఖ్యంగా దర్శకనిర్మాతలు చిరంజీవి గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలను జతచేర్చారు. ప్రతి అధ్యాయానికి భావుకత నిండిన శీర్షిక నిర్ణయించడంలో కూడా రచయిత గౌతమ్ తన ప్రత్యేకతను ప్రదర్శించారు. మస్తు మాస్ 'ముతాబాస్'; 'వసూళ్ళే' కట్నకానుకలు - 'దొంగమొగుడు'; నంది వరించిన నటబుషి - స్వయంకృషి. ఇలా. ఇలాంటి పుస్తకాలు వ్రాయడంలో ఒక ఇబ్బంది ఉంటుంది - ఉన్న సమాచారాన్ని యదాతథంగా వ్రాస్తే కేవలం ప్రెస్ రిపోర్ట్ గా ఉంటుందంతే. విషయానికి చక్కటి శైలి,కథనం జోడిస్తేనే పాఠకుడిని ఆకట్టుకుంటుంది. 300 పైగా పేజీలతో, అందమైన ముద్రణతో తీర్చిదిద్దిన ఈ పుస్తక రచనలో గౌతమ్ అన్నికోణాల్లో నూరుశాతం విజయం సాధించారనడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు. కేవలం చిరంజీవి అభిమానులనే కాదు, ఏ తెలుగు సినీ అభిమానికైనా ఈ పుస్తక పఠనం విందుభోజనమే..!

***